# మంత్రిపై అసత్య ఆరోపణలు మానుకో..

• కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

ఏర్గట్ల, అక్టోబర్ 28: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునిల్ రెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం హెచ్చరించారు. మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి మంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎన్నికల్లో భాగంగా తొర్తి, తాళ్ల రాంపూర్, దోంచంద గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన ముత్యాల సునీల్‌రెడ్డి అసత్య ప్రచారం చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రజలు మరోసారి లక్ష ఓట్ల మెజారిటీతో మంత్రిని గెలిపిస్తారని అన్నారు. సమావేశంలో రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు నేరెళ్ల లింగారెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు సున్నపు అంజయ్య, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్కెర దేవన్న, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు సుభాష్ రెడ్డి, కృష్ణ, బీఆర్ఎస్ మండల నాయకులు మోత్కూరి భాలజీ గౌడ్, మస్తాన్, నిరటి నరేశ్, సురేశ్, జాతర కొండ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజపూర్ణానందం

## ‘మాలల పేరుతో రాజకీయం చేయొద్దు’



మాట్లాడుతున్న మాల మహానాడు బోధన్ నాయకులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 28: మాలల పేరు చెప్పి బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య రాజకీయం చేయడం సరికాదని మాల మహానాడు బోధన్ పట్టణ అధ్యక్షుడు రేఖం దాసు అన్నారు. శనివారం శక్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించడంతోపాటు, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. అలాంటి ఎమ్మెల్యే షకీల్‌ను విమర్శించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే షకీల్ చొరవతోనే ఆయన మున్సిపల్ చైర్మన్ పదవి చేపట్టాడని అన్నారు. సమావేశంలో మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు మొగులయ్య, పట్టణ కోశాధికారి స్వామి, నాయకులు పెర్క యాదగిరి, ఎం. సాయిలు, తలారి స్వామి, కాసర్లస్వామి, తలారి బాలకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, నారాయణ, ఆరుట్ల శంకర్, డాంగే సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్, అక్టోబర్ 28: కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మండలంలోని చౌట్‌పల్లి గురడి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, ఎంపీపీ లోలపు గౌతమీ సుమన్, జడ్పీటీసీ పెరుమాండ్ల రాధ రాజాగౌడ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, పార్టీ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యుడు లుక్క గంగాధర్, చౌట్‌పల్లి గ్రామ అధ్యక్షుడు ఆరెల్లి నవీన్ గౌడ్ తెలిపారు. అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

**లింబాద్రిగుట్ట వద్ద..**

భీమ్‌గల్ మండల కార్యకర్తల సమావేశం మండలంలోని లింబాద్రి గుట్ట వద్ద మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలం అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

## ‘అభినందన సభను విజయవంతం చేయాలి’

ఏర్గట్ల, అక్టోబర్ 28: ఈ నెల 30న భీంగల్‌లోని సహస్ర కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఐఐహెచ్‌డబ్ల్యూ చైర్మన్ డాక్టర్ ఎం.జే మధుశేఖర్ అభినందన సభకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని నాయకులు లక్కం నర్సయ్య, పోలింగ్, గన్నరపు రాజేశ్వర్ కోరారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారు ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కూతురు చిన్న సాయన్న, భీమ గంగాధర్, యుగేందర్, అంబాటి రాజేశ్వర్, ఇరిగేల గణేశ్, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్28: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో కంటి వైద్యశివిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీఓలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపికృష్ణ, తులసి పట్వారి, ప్రాజెక్ట్ చైర్మన్ గోనె దామోధర్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



బోధన్ పట్టణం నర్సాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

బోధన్/బోధన్ రూరల్/నందిపేట్, అక్టోబర్ 28: బోధన్ పట్టణంలోని నర్సాపూర్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు, ఆ పార్టీ కౌన్సిలర్లు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అంశాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ అందిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. మున్సిపల్ కౌన్సిలర్లు దేగావత్ దూప్‌సింగ్, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ బోధన్ పట్టణ అధ్యక్షుడు జాదవ్ ప్రవీణ్ నాయక్, మహ్మద్ ఉస్మాన్, నామాల రాకేశ్, షేక్ ఖాజా, జాజ్యనాయక్, కన్నడి మల్లేశ్ పాల్గొన్నారు.

బోధన్, సాలూర మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బోధన్ ఎమ్మెల్యేగా షకీల్‌ను గెలిపించాలని కోరారు. సాలూరలో పార్టీ నాయకుడు బుద్దె రాజేశ్వర్, జాడిజమాల్‌పూర్‌లో పార్టీ సాలూర మండల అధ్యక్షుడు నర్సన్న, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, మజర్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ మండలంలోని మల్లారం, షాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డిని మరోమారు గెలిపించి కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, వైస్ ఎంపీపీ దేవేందర్, సీనియర్ నాయకులు మజారొద్దీన్ పాల్గొన్నారు.

# ‘అపార్ ఐడీ’పై తల్లిదండ్రులకు అవగాహన




మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

మాక్లూర్, అక్టోబర్ 28 : మండలంలోని అమ్రాద్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి దుర్గా ప్రసాద్ హాజరై మాట్లాడారు. విద్యార్థులను రోజూ పాఠశాలకు పంపాలని సూచించారు. విద్యార్థులకు ఇంటి వద్ద ప్రత్యేక సమయం కేటాయించి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్ ఐడీ కార్డు) పేరిట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరి అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి విద్యార్థికీ ఒక గుర్తింపు సంఖ్యను కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నదని అన్నారు. చదువులో వారి పురోగతిని నమోదు చేయవచ్చని, వారి ధృవీకరణ పత్రాలను డిజీ లాకర్‌లో ఉంచవచ్చని చెప్పారు. విద్యార్థులు చదువు మానేసినా తెలుసుకోచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేశ్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ చక్రపాణి, రమేశ్ పాల్గొన్నారు.

## పంటల సాగుపై అవగాహన

బోధన్ రూరల్, అక్టోబర్ 28: సాలూర మండలంలోని హున్సా గ్రామంలో శనివారం ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధనా కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో యాసంగి పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్ మాట్లాడుతూ నీటి వసతి, నేలకు అనుకూలమైన పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు. శనగ పంటలో రైజోబియం ట్రైకోడర్మా ప్యాకెట్లను అందించారు. పంటల్లో కత్తెర పురుగు ఉధృతిని నివారించేందుకు లింగాకర్షణ బట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగామణి గంగారం, ఏఈవో సాయిచరణ్, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

## సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్28: పట్టణంలో నవంబర్ 3న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి తెలంగాణ స్టేట్ ఇండ్రస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ గ్యాదరి బాలమల్లుతో కలిసి శనివారం పరిశీలించారు. బహిరంగ సభకు భారీ ఎత్తున్న ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభ ప్రాంగణాన్ని జేసీబీలతో చదును చేస్తూ సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు పోల సుధాకర్ పాల్గొన్నారు.

## భార్య, కుమారుడు దాడి.. వ్యక్తి మృతి



చౌట్‌పల్లిలో వివరాలు తెలుసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 28: మండలంలోని చౌట్‌పల్లిలో కుటుంబ తగాదాలతో జరిగిన గొడవలో ఒకరు మృతి చెందారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, కమ్మర్‌పల్లి ఎస్సై రాజ శేఖర్ కథనం ప్రకారం.. చౌట్‌పల్లిలోని వడ్డెర కాలనీకి చెందిన పల్లపు ఎల్లయ్య (40) నెల రోజుల క్రితం దుబాయి నుంచి ఇంటికి వచ్చాడు. ఎల్లయ్య కొడుకు పల్లపు నవీన్ దుబాయ్ నుంచి 15 రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. శుక్రవారం రాత్రి పల్లపు ఎల్లయ్యకు భార్య పల్లపు రాజు, కొడుకు పల్లపు నవీన్‌తో గొడవ జరిగింది.. గొడవలో భార్య రాజు, కొడుకు నవీన్ కలిసి ఎల్లయ్యను గొంతు నొక్కి దాడి చేశారు. ఎల్లయ్యకు తల వెనకాల తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. మృతుడి సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టు మార్టానికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ, ఎస్సై తెలిపారు.

## కారు, బైక్ ఢీ.. షెట్‌పల్లి వాసి..

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 28: మండల కేంద్రం శివారులో 63వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోర్తాడ్ మండలం షెట్‌పల్లికి చెందిన సాకలి భూమన్న (55) మృతి చెందాడు. మెట్‌పల్లి వైపు నుంచి భూమన్న బైక్‌పై వస్తున్నాడు. మండల కేంద్రం శివారులో కారు, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. భూమన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు..

రెంజల్, అక్టోబర్ 28: ఈనెల 25న ఆత్మహత్యకు యత్నించిన దూపల్లికి చెందిన సంగెం భాస్కర్ (21) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. భాస్కర్ ఈనెల 25న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయనను మెరుగైన వైద్యం కోసం అంబులెన్సులో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నాలుగేండ్ల క్రితం అక్క పెళ్లి, ఏడాది క్రితం తమ్ముడు దుబాయ్ వెళ్లేందుకు చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## మనస్తాపంతో ఉరేసుకుని..

ఎడపల్లి, అక్టోబర్ 28: మండల కేంద్రంలో అప్పుల బాధ, కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై విక్రమ్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. కళ రాంచందర్(34) వ్యవసాయ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం కొత్త ఇల్లు నిర్మించుకుని పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ అవసర నిమిత్తం అప్పులు చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో లోన్ కోసం డబ్బులు కట్టి మోసపోయాడు. మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.